andhrajyothy.com
ఆంధ్రజ్యోతి



మళ్లీ డి-1 పట్టాల లొల్లి



మామడ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న న్యూసాంగ్వి గ్రామస్థులు

- ఆందోళనకు సిద్ధమవుతున్న న్యూ సాంగ్వి గ్రామస్థులు
- అక్రమ పట్టాలను రద్దు చేయాలంటూ ఉద్యమానికి సిద్ధం
- బోగస్ సేత్వారీలపై విచారణ జరపాలంటున్న గ్రామస్థులు
- ఓ మీ సేవా కేంద్రంగా భారీగా దందా
- రికార్డుల తారుమారు.. మాయమైన ఫైళ్లు
- కొత్త కలెక్టర్ చర్యలు చేపట్టాలని కోరుతూ వినతులు

నిర్మల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గత కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హయాంలో దుమారం రేపిన నకిలీ డి-1 పట్టాలు, నకిలీ సప్లిమెంట్ సేత్వారీల అక్రమాల వ్యవహారం మరోసారి తెరపైకి వస్తోంది. అప్పటి కలెక్టర్ జిల్లాలో దాదాపు 350 అక్రమ డి-1 పట్టాలున్నట్లు తన విచారణలో నిగ్గు తేల్చారు. వీటిపై చర్యలు చేపట్టేందుకు ఆయన ఉపక్రమించారు. అయితే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని కొంతమంది కీలక ప్రజా ప్రతినిధులు, నేతల ఒత్తిళ్ల కారణంగా ఆ వ్యవహారం సద్దుమణిగింది. ఈ నేపథ్యంలోనే అప్పటి కలెక్టర్ బదిలీ కావడం, కొత్తగా జిల్లాకు అభిలాష అభినవ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడంతో మళ్లీ ఈ అక్రమ డి-1 పట్టాల వ్యవహారాన్ని బాధిత గ్రామస్థులు తెరపైకి తెస్తున్నారు. మామడ మండలం న్యూ సాంగ్వి గ్రామస్థులు మళ్లీ డి-1 పట్టాల అక్రమాలపై ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం వారంతా ఇక్కడి కలెక్టరేట్‌కు తరలివచ్చి తమ గ్రామంలో జరిగిన డి-1 పట్టాల అక్రమాలపై విచారణ జరపాలని అలాగే అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వారంతా నేరుగా జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. కలెక్టర్ ఇతర కార్యకలాపాల్లో నిమగ్నమైన కారణంగా వారు మళ్లీ సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల విభాగానికి తరలిరానున్నారు. జిల్లాలో వందల ఎకరాల ప్రభుత్వ భూములను అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధికారుల అండదండలతో డి-1 పట్టాల పేరిట స్వాహా చేశారన్న ఆరోపణలున్నాయి. ఏకంగా నకిలీ సేత్వారీలు సృష్టించడం ఆ తరువాత వాటిని రిజిస్ట్రేషన్ చేసుకుని భూములను కైవసం చేసుకోవడం జరిగిందని అంటున్నారు. ఎస్సారెస్పీ పునరావాస గ్రామాలకు చెందిన కొంతమంది వృద్ధులను లక్ష్యంగా చేసుకొని వారి పేరిట తప్పుడు డి-1 పట్టాలను సృష్టించారన్న ఆరోపణలున్నాయి. కాగా అప్పటి కొంతమంది అధికారుల అండదండలతో సేత్వారీలు తయారు చేయించడం, అలాగే సర్కారు భూములను గుర్తించి వాటిని తమ ఆధీనంలోకి తీసుకోవడం జరిగిందని అంటున్నారు. మామడ మండలంతో పాటు నిర్మల్, లోకేశ్వరం, ముథోల్ మండలాల్లో ఈ నకిలీ డి-1 పట్టాల దందా పెద్దఎత్తున జరిగిందన్న ఫిర్యాదులున్నాయి. గతంలో ఆయా గ్రామాల ప్రజలు తమ గ్రామంలో కొంతమంది నకిలీ డి-1 పట్టాలను సృష్టించుకొని తమ గ్రామ అవసరాలకు వినియోగించుకోవాల్సిన భూములను కబ్జాలు చేస్తున్నారంటూ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఆ దిశగా చర్యలు జరగలేదు. కొంతమంది అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గి డి-1 పట్టాలపై విచారణ జరపకుండా జాప్యం చేశారని అంటున్నారు. ఈ క్రమంలోనే కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్ దృష్టికి నకిలీ డి-1 పట్టాలు, నకిలీ సేత్వారీల వ్యవహారాన్ని తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నకిలీ పట్టాల వ్యవహారం కొత్త కలెక్టర్ దృష్టికి వచ్చిందని ఆమె వారం రోజుల్లో మొత్తం ఈ వ్యవహారంపై అంతర్గత విచారణ జరిపే అవకాశాలున్నట్లు సమాచారం.

అటకెక్కిన గత కలెక్టర్ విచారణ

కాగా గత కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నకిలీ డి-1 పట్టాలు, అక్రమ సేత్వారీలపై లోతుగా విచారణ జరిపారు. మొత్తం 350కి పైగా నకిలీ డి-1 పట్టాలు తయారైనట్లు అప్పటి కలెక్టర్ నిర్ధారించారు. ఈ డి-1 పట్టాలతో వందల ఎకరాల ప్రభుత్వ భూమిని కైవసం చేసుకున్నట్లు గుర్తించారు. దీంతో ఆయన ఈ వ్యవహారాన్ని సంబంధిత రెవెన్యూశాఖలోని విజిలెన్స్‌కు అలాగే పోలీసుశాఖలోని ఇంటలిజెన్స్ వర్గాలకు అందించి విచారించాల్సిందిగా సూచించారు. అయితే పరిపాలన పరమైన కార్యకలాపాల్లో బిజీగా మారిపోవడంతో ఈ వైపు అప్పటి కలెక్టర్ చర్యలకు జాప్యం చేశారని అంటున్నారు. ఈ అవకాశాన్ని కొంతమంది అధికారులు తమకు అనుకూలంగా మలుచుకొని రికార్డులను సైతం తారుమారు చేశారని అంటున్నారు. అక్రమ డి-1 పట్టాలు, సేత్వారీల తయారీ వ్యవహారంలో లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. అప్పటి కొంతమంది అధికారులు ఏకంగా రికార్డులనే తారుమారు చేసి ఈ అక్రమాల వ్యవహారాన్ని కొనసాగించారంటున్నారు. 2014 సంవత్సరం నుంచి 2018 సంవత్సరం వరకు ఈ అక్రమ డి-1 పట్టాల దందా యథేచ్ఛగా సాగిందని అంటున్నారు. ప్రస్తుతం రిటైర్డ్ అయిన ఓ అధికారి ఈ అక్రమాల దందాకు పూర్తిగా అండగా నిలిచినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

ఆందోళనకు సిద్ధమవుతున్న గ్రామస్థులు

కాగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరావాస గ్రామాల పేరిట జరిగిన ఈ నకిలీ డి-1 పట్టాల దందాపైనా సంబంధిత గ్రామస్థులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. తమ గ్రామాల్లో ప్రజా అవసరాల కోసం సేకరించుకున్న భూములను అక్రమార్కులు డి-1 పట్టాల పేరిట కబ్జా చేయడాన్ని గ్రామస్థులు అడ్డుకుంటున్నారు. ఇప్పటికే పలు గ్రామాల ప్రజలు ఆందోళనలు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం మామడ మండలంలోని న్యూసాంగ్వి, సిద్దిలకుంట గ్రామాలతో పాటు మిగతా గ్రామాల ప్రజలు ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారంటున్నారు. అప్పట్లో వీరంతా కలెక్టరేట్‌ను సైతం ముట్టడించి నిరసనలు తెలిపారు. తాజాగా న్యూసాంగ్వి గ్రామస్థులు మరోసారి ఈ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగానే వీరంతా శనివారం కలెక్టరేట్‌కు తరలివచ్చి డి-1 పట్టాల అక్రమాలపై ఫిర్యాదులు చేశారు. సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల విభాగంలో వారంతా కలెక్టర్‌ను కలిసి ఈ వ్యవహారంపై ఫిర్యాదులు చేయనున్నారు.

కూపీలాగుతున్న కొత్త కలెక్టర్

ఇదిలా ఉండగా డి-1 పట్టాల అక్రమాలు, సేత్వారీల అక్రమాలపై కొత్త కలెక్టర్ రహస్యంగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ అక్రమాల వ్యవహారాన్ని కొంతమంది కలెక్టర్ అభిలాష అభినవ్ దృష్టికి తీసుకుపోవడంతో ఆమె అప్పటి కలెక్టర్ జరిపిన విచారణ నివేదికను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆ నివేదికల ఆధారంగా మరోసారి 2014 నుంచి 2018 సంవత్సరం వరకు జరిగిన నకిలీ డి-1 పట్టాలు, సేత్వారీల దందాపై విచారణ జరిపి చర్యలు తీసుకోనున్నట్లు సంబంధిత అధికార వర్గాల ద్వారా తెలిసింది. మొత్తానికి మరోసారి నకిలీ డి-1 పట్టాల అక్రమాల వ్యవహారం రాజకీయంగానే కాకుండా అధికారుల అవినీతి, అప్పటి బీఆర్ఎస్ పార్టీ నేతల అక్రమాల అసలు రంగును గుట్టు రట్టు చేయబోతోందని అంటున్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సిద్దిలకుంట గ్రామస్థులు (ఫైల్)

ఘనంగా గంగనీళ్ల పూజ

దిలావర్‌పూర్, జూన్ 28 : మండలంలోని సముందర్‌పల్లి గ్రామస్థులు శుక్రవారం గంగనీళ్ల పూజ చేశారు. గ్రామస్తులు గడముంతలు చేతపట్టి గంగనీళ్ల కోసం గంగా (గోదావరినది)కి వెళ్లారు. అక్కడ ప్రత్యేకపూజలు చేశారు. గడముంతల్లో గంగానీళ్లు తీసుకుని తిరిగి గ్రామానికి చేరుకున్నారు. గంగానీళ్లతో గ్రామ దేవతలను అభిషేకించి పూజలు చేశారు. మిగిలిన నీటిని ఇంటికి తీసుకెళ్లి ఇళ్లలో, పశువుల పాకల్లో చల్లి పాడి పంటలు బాగుండాలని, పిల్లాపాపలను చల్లంగా చూడాలని గ్రామదేవతలకు మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన శివసత్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం



కలెక్టర్‌ను కలిసి పూల మొక్క అందజేస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, జూన్ 28 : జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌ను ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 3194 (ఐఎన్‌టీయూసీ) జిల్లా కార్యవర్గం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూలమొక్కలు అందజేసి కొత్త కలెక్టర్‌కు స్వాగతం పలికారు. తమ ఆరోగ్యశాఖ ఉద్యోగులకు అన్ని విధాలుగా సహకరిస్తానని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారని సంఘం జిల్లా అధ్యక్షుడు కే. కృష్ణమోహన్‌గౌడ్ తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమోహన్‌గౌడ్, కోశాధికారి వేణుగోపాల్‌రావు, జిల్లా సంఘం నాయకులు బారే రవీందర్, భోజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వేణురావ్, మహేందర్, నర్సయ్య, కొమురయ్య ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఖానాపూర్, జూన్ 28 : అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కడెం మండలం సారంగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, గ్రామస్థులు తెలిపిన కథనం ప్రకారం.. పసుపుల నర్సయ్య(47) గత కొన్నేళ్లుగా రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఆశించిన పంట దిగుబడి రాక నష్టపోయిన నర్సయ్య శుక్రవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సయ్యకు భార్య నాగవ్వ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఆరుగురి రిమాండ్

కడెం మండలం ఉప్పరిగూడలో 20వ తేదీన ఒంటరిగా వెళ్తున్న ఒక మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఆరుగురిని రిమాండ్ చేసినట్లు కడెం ఎస్సై ఎం. కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈ కేసులో హరిజనవాడకు చెందిన మచ్చ చింటూ, మచ్చ ప్రభాకర్, అరికెల ప్రభాకర్, చిట్యాల విద్యాసాగర్, దిల్దార్‌నగర్‌కు చెందిన ఉప్పారపు మనోహర్, బోర్నపల్లికి చెందిన దాగుల నాగరాజులను మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించి జైలుకు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు.

సత్తెనపల్లిలో అగ్నిప్రమాదం.. నాలుగు లక్షల ఆస్తి నష్టం

ఖానాపూర్, జూన్ 28 : మండలంలోని సత్తెనపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు, ఫైర్‌సిబ్బంది తెలిపిన కథనం ప్రకారం... సత్తెనపల్లి గ్రామానికి చెందిన గుగ్లావత్ రవీందర్ నివాసంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కావడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో ఇళ్లుతో పాటు ఇంట్లో ఉన్న పాస్ పుస్తకాలు, బంగారం, నగదు, ఫర్నిచర్, బీరువా, టీవీ, కూలర్ లాంటి వస్తువులన్నీ దగ్ధమైనట్లు వారు పేర్కొన్నారు. భారీగా మంటలు ఎగసిపడుతుండడంతో ఫైర్ ఇంజన్ ద్వారా సిబ్బంది వెంకటేశ్వర్లు, వెంకటేష్, శంకర్, తదితరులు మంటలను ఆర్పేసి మంటలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు.

పీవీ గొప్ప దార్శనికుడు : డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, జూన్ 28 : మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడని ఆయన దేశానికి చేసిన సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు కొనియాడారు. శుక్రవారం ఆయన జయంతి పురస్కరించుకొని శాంతినగర్ చౌరస్తాలోని పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి, పట్టణాధ్యక్షుడు నాందేడపు చిన్ను, కౌన్సిలర్లు నరేందర్, గండ్రత్ రమణ, నాయకులు నర్సాగౌడ్, నరేష్‌రెడ్డి, కుంట వేణు, తదితరులు పాల్గొన్నారు. బంగల్‌పేట్, నాయుడివాడలో ఇటీవల కుక్కల దాడిలో గాయపడ్డ బాధితులను శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు పరామర్శించారు.

'ఖానాపూర్ సీడీపీవోను సస్పెండ్ చేయాలి'

ఖానాపూర్, జూన్ 28 : ఖానాపూర్ సీడీపీవో సస్పెండ్ చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో బాధిత అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల ఆరవ తేదీన ఖానాపూర్ సీడీపీవోకు సంబంధించిన అక్రమాలపై పూర్తి ఆధారాలతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ తెలంగాణ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఓ పక్క స్పష్టమైన ఆధారాలు అందజేసినప్పటికీ తూతూ మంత్రంగా విచారణకు ఆదేశించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. బాధిత అంగన్‌వాడీ టీచర్ ధైర్యంగా బయటికి వచ్చి సీడీపీవో అక్రమాలపై ఆధారాలను చూపితే ఆమెకు అక్రమ సంబంధాలు అంటగట్టి వారి మనోధైర్యం దెబ్బతినేలా చేయడం పెద్ద నేరమన్నారు. వెంటనే సదరు సీడీపీవోను విధుల నుండి తప్పించి ఆమెపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. బాధిత అంగన్‌వాడీ టీచర్లను కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి : ఏబీవీపీ డిమాండ్

నిర్మల్ కల్చరల్, జూన్ 28 : ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల దోపిడీ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. శుక్రవారం ఛలో డీఈవో కార్యక్రమాన్ని విద్యార్థి సంఘం చేపట్టింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ శివ కుమార్ మాట్లాడుతూ... జీవో నెంబర్ ఒకటిని పట్టించుకోకుండా ప్రైవేట్ పాఠశాలలు పుస్తకాలు, డ్రెస్సులు అమ్ముతున్నారని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు నియంత్రణ చట్టం అమలు, మౌలిక సౌకర్యాలు, ఎంఈవో పోస్టుల భర్తీ తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. గణేష్, మహేష్, సిద్ధార్థ్, రాజు, దినేష్, పాల్గొన్నారు.

బాసర గ్రామంలో మహా అన్నదానం



బాసర, జూన్, 28 : బాసర గ్రామస్థులు శుక్రవారం వేలాది మందికి మహా అన్నదానం నిర్వహించారు. ఊరంతా ప్రజలు వంట సరుకులు పోగు చేసి ఈ అన్నదానం నిర్వహించారు. గ్రామస్థులు అందరూ పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కంటే ముందు పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని కోరుకుంటూ గ్రామస్థులు అన్నదానం చేయడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. గ్రామంలో ఉన్న ధనిక, పేద తేడా లేకుండా అందరూ వంట సరుకులకు విరాళంగా ఇచ్చి అందరు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మొదట సరస్వతీ అమ్మవారికి అభిషేకం, పూజ నిర్వహించి వస్త్రాలను నైవేద్యాలు సమర్పించిన అనంతరం ఈ అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశం

నిర్మల్ టౌన్, జూన్ 28 : భారీవర్షాలు, వరదల వలన ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భారీవర్షాలు, వరదల వలన ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చేపట్టవలసిన ముందస్తు చర్యలపై జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆమె సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వరదలు సంభవించినప్పుడు స్వర్ణ, కడెం, గడ్డెన్నవాగు ప్రాజెక్టులు, అలాగే గోదావరి పరివాహక లోతట్టు ప్రాంతాల గ్రామాలకు ముందస్తు సమాచారం అందించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అప్రమత్తం చేయాలని సూచించారు. పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీలో గత వరదల వలన జరిగిన నష్టం పునరావృతం కాకుండా పటిష్టచర్యలు తీసుకోవాలన్నారు. డిసాస్టర్ మేనేజ్మెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం నీటి పారుదల శాఖాధికారులు జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల సమాచారాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, అటవీ శాఖాధికారి ప్రసాద్, డీఆర్‌వో భుజంగరావు, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నిర్మల్ అర్బన్ : సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలనికలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఆస్రాకాలనీ, శాంతినగర్‌లో విస్తృతంగా పర్యటించారు. డ్రై డే కార్యక్రమం అమలు తీరును పరిశీలించి, వర్షపు నీరు నిలిచిన ప్రదేశాలలో ఆమె ఆయిల్‌బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వర్షాకాలం నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. వ్యాధులు వ్యాపించకుండా ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని పంచాయతీ, వైద్య, మున్సిపల్ శాఖల అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఈశ్వర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.ధనరాజ్, మెప్మా పీడీ సుభాష్, మున్సిపల్ డీఈ సంతోష్, వైద్యులు రాజేందర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి రవీందర్, స్థానిక కౌన్సిలర్లు, వైద్య, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

నిర్మల్ కల్చరల్ : పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు వసతులు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సోమవార్‌పేట్ ప్రభుత్వ బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పరిసరాలు పరిశీలించి, పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యా ర్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. భోజన నాణ్యత, పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ, హాజరు శాతం, ఉత్తీర్ణత తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం సందర్శించారు. పిల్లలకు ప్రతిరోజు గుడ్లు, పాలు, పౌష్టికాహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. శుభ్రత పాటించాలని, పిల్లల ఎత్తు, బరువు తగిన విధంగా ఉండేలా పర్యవేక్షించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి కలెక్టర్ వెంట ఉన్నారు.

రసాయనశాస్త్ర అధ్యయనంతో భవిష్యత్తు

జాతీయసదస్సులో వక్త డాక్టర్ ఎల్. రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ ఎల్. రాజేందర్‌రెడ్డి.. సావనీర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

నిర్మల్ కల్చరల్, జూన్ 28 : రసాయనశాస్త్ర అధ్యయనం, పరిశోధనలతో సుదీర్ఘ భవిష్యత్ ఉంటుందని ఎరింగ్ ప్రోడెవ్ సీఈవో డాక్టర్ ఎల్. రాజేందర్ రెడ్డి అన్నారు. నిర్మల్‌లో శుక్రవారం డిగ్రీ కళాశాలలో ప్రారంభమైన జాతీయ సదస్సుకు ఆయన వక్తగా హాజరై మాట్లాడారు. రసాయనశాస్త్ర అధ్యయనం కంప్యూటర్ విద్య కంటే ప్రయోజనం ఉంటుందన్నారు. సుస్థిరాభివృద్ధి, మానవజీవితాన్ని సులభతరం చేస్తుందన్నారు. హానికర రసాయనాలు తొలగించడానికి హరిత రసాయన పద్ధతులు ఉపయోగపడతాయని మరో వక్త దిలీప్ స్వామి అన్నారు. పునర్వినియోగ శక్తి వనరులను ఉపయోగించే పద్ధతులను ప్రొఫెసర్ ఎంఎం బేగ్ వివరించారు. ఈ సందర్భంగా సావనీర్ ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ భీంరావు, భైంసా ప్రిన్సిపాల్ సుధాకర్, డా.సంపత్‌కుమార్, వినోద్‌కుమార్, అతీక్‌బేగం, పలు యూనివర్సిటీల నుంచి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు



దొత్తివాగు దాటుతున్న ప్రజలు

పెంబి రూరల్, జూన్ 28 : గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పెంబి మండలంలోని దొత్తివాగు, కడెం వాగు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో మండలంలోని పస్పుల, గుమ్మెన, యాపల్‌గూడ, దొందారి, వస్‌పెల్లి, రాంనగర్, నాయికపు గూడ, అంకెన, పోచంపల్లి, హరిచంద్ తండా గ్రామాలకు అంతరాయమైంది. మండల కేంద్రంలో శుక్రవారం వారసంత కావడంతో కొంత మంది భయంతో వాగులు దాటుతూ మండల కేంద్రానికి వారసంతకు వచ్చారు. అధికారులు స్పందించి వాగులపై వంతెన, రోడ్లు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి

సారంగాపూర్, జూన్ 28 : మండలంలో గల మహావీర్ తండాకు చెందిన ఆడే రమేష్(45) అనే వ్యక్తి పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రమేష్ గత కొన్ని రోజుల నుంచి మద్యం సేవించడంతో అనారోగ్యం బారిన పడ్డాడు. మనస్తాపం చెంది గత నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన సీఐ

మండలకేంద్రంలో గల పోలీసుస్టేషన్‌ను శుక్రవారం సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ నేపథ్యంలో రికార్డులను పరిశీలించి, పోలీసు సిబ్బందికి జూలై నెల నుంచి అమలులోకి వచ్చే నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.

సంక్షిప్త సమాచారం

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

తానూర్, జూన్ 28 : మండలంలోని కోలూర్ గ్రామానికి చెందిన దేవాక్వాడ్ అశోక్(31) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాల ప్రకారం.. మృతుడు కూలీగా జీవనం సాగించేవాడు. అయితే కొన్ని రోజులుగా మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది శుక్రవారం తమ పొలంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు భార్య దీక్ష ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భైంసా రూరల్, జూన్ 28 : మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన వి. నవీన్(32) బైక్ అదుపు తప్పి మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... వానల్‌పాడ్ గ్రామానికి చెందిన వి. నవీన్ కుంటాల ఆదర్శ పాఠశాలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. రాత్రి తన సొంత పని కొరకు బైక్‌పై కల్లూరుకు వెళ్లి వచ్చే సమయంలో తిమ్మాపూర్ గ్రామం వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. 108లో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని భార్య రమ్యకృష్ణ పిటిషన్ మేరకు దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

కలకత్తా ఆసుపత్రిలో జిల్లా మహిళ



నిర్మల్ కల్చరల్, జూన్ 28 : జిల్లా కేంద్రానికి చెందిన బార్స లీలావతి కలకత్తాలోని డాక్టర్ అలీ వద్ద పావ్లోవ్ ఆసుపత్రిలో ఉందని నిర్మల్ పోలీసులు తెలిపారు. నాయుడివాడ, రామారావుబాగ్‌కు చెందిన లీలావతి ఆమె తల్లి, సంతోష్ సోదరుడని తెలిపారు. సంబంధికులు ఎవరైనా హాస్పిటల్‌కు వెళ్తే ఆమెను అప్పగిస్తామని డాక్టర్ ఫోన్ చేసి చెప్పినట్లు పేర్కొన్నారు. డాక్టర్ ఫోన్‌నెంబర్ 9732064759కు సంప్రదించవచ్చునని తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

దిలావర్‌పూర్, జూన్ 28 : మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన లింగన్న అనే వృద్ధుడు, లక్కీ అనే యువకుడు తమ ద్విచక్ర వాహనాలపై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పెద్ద చెరువును పరిశీలించిన అధికారులు

దస్తురాబాద్, జూన్ 28 : మండల కేంద్రంలోని పెద్ద చెరువును శుక్రవారం రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెద్ద చెరువులో అక్రమంగా సాగు చేస్తున్నారని గంగపుత్ర సంఘం వారు ఫిర్యాదు చేశారని తెలిపారు. పెద్ద చెరువును పరిశీలించి, అక్రమంగా సాగు చేసేందుకు ప్రయత్నం చేస్తున్న రైతులకు నోటీసులు పంపించి చర్యలు తీసుకుంటామన్నారు. రెండు రోజులలో పెద్ద చెరువులో రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు జాయింట్ సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామన్నారు.



గుడిహత్నూర్ మోడల్ స్కూల్‌లో సైన్స్ ల్యాబ్ గది నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయించిన నిరసన వ్యక్తం చేస్తున్న జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ నాయకులు

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్, జూన్ 28: అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే మండలంలో పర్యటించారు. తోషం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సైన్స్ ల్యాబ్ గది నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి కుటుంబాలకు ఆడ పిల్లల పెళ్లిలు భారం కాకూడదని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణ లక్ష్మీ పథకం ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేంద్రే జ్ఞానోబా, జడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, వైస్ ఎంపీపీ భారత్, తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్‌హై, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, తోషం ఎంపీటీసీ సాగర్ ఖాన్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.శివాజీ, హెచ్‌ఎం బాలాజీ తిలవత్, పీఏసీఎస్ చైర్మన్ ముండే సంజీవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● సమాచారం ఇవ్వలేదని నిరసన

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి గుడిహత్నూర్ ఎంపీటీసీ-2 కోవ తులసికి తహసీల్దార్ కవితారెడ్డి సమాచారం ఇవ్వలేదని జడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, వైస్ ఎంపీపీ భారత్ నాయకులు ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. సమాచారం ఎందుకు ఇవ్వలేదని తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. ఒక మహిళా ప్రజా ప్రతినిధిని అవమానపరచడం సరికాదన్నారు. అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారిని సముదాయించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

గ్రామాభివృద్ధి కోసం ప్రతీఒక్కరు పాటుపడాలి

● స్వాగత తోరణాన్ని ప్రారంభించిన లోక భూమారెడ్డి

తలమడుగు, జూన్ 28: గ్రామ అభివృద్ధి కోసం ప్రతీఒక్కరు పాటు పడాలని హసన్ హస్సేన్ ఆలయ కమిటీ చైర్మన్ లోక భూమారెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ దాదాపు రూ.17 లక్షల వ్యయంతో నిర్మించిన స్వాగత తోరణంను విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమారెడ్డి మాట్లాడుతూ.. కనిపించిన తల్లిదండ్రులను విద్యా నేర్పిన గురువులను పుట్టి పెరిగిన గ్రామాన్ని ఎప్పటికీ మర్చిపోవద్దన్నారు. ఢిల్లీకి రాజైన తల్లికి కొడుకు లాగే గ్రామాభివృద్ధి కోసం ఎంత చేసిన తక్కువనే అన్నారు. ఉద్యోగ ఉపాధిరీత్యా ఎక్కడ ఉన్నా గ్రామాన్ని మర్చిపోకుండా గ్రామాభివృద్ధి కోసం రూ.17 లక్షల రూపాయలతో స్వాగత తోరణం ప్రారంభించడం ఎంతో అభినందనీయం అన్నారు. అదే విధంగా రుయ్యడి హసేన్ హస్సేన్ ఆలయానికి దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. హస్సేన్ హస్సేన్ సవర్లదయతో, రాజకీయంగా రాష్ట్రస్థాయిలో రాణించడం జరిగిందన్నారు. అనంతరం స్వాగత తోరణాన్ని ప్రారంభించారు. అదేవిధంగా సెల్ఫీ పాయింట్ ఐలవ్ రుయ్యాడిని ప్రారంభించారు. అనంతరం దాత కొండూరు గంగాధర్‌ను హసేన్ హస్సేన్ కమిటీ సభ్యులు గ్రామస్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఇదే స్ఫూర్తితో ప్రతీఒక్కరు గ్రామ అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. ఇందులో సీఈవో మోతే శ్రీనివాస్, డీఆర్‌డీఏ మేనేజర్ గంగన్న, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, గ్రామస్తులు భూమారెడ్డి, ప్రకాష్ రెడ్డి, గంగాధర్, వెంకట్‌రెడ్డి, అయ్యన్న గణపతి, హన్మాండ్లు, విజేందర్, జగదీష్, ప్రకాష్‌రెడ్డి, గ్రామస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



స్వాగత తోరణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



ఎగ్జామ్ ప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

'విద్యార్థులు కష్టపడి చదవాలి'

ఇంద్రవెల్లి, జూన్ 28: ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి వారి జీవిత గమ్యాన్ని చేరుకోవాలని హిందూ వాహిని జిల్లా అధ్యక్షులు ఆర్యన్ మహరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో టైగర్ గ్రూప్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ గోపాల్ ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన 300 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లు, తదితర సామగ్రిని ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ లక్ష్యానికి అనుగుణంగా ముందుకెళ్లి శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ఇందులో టైగర్ గ్రూపు మండల అధ్యక్షుడు గావండే గజానంద్, సోనాల మండల అధ్యక్షుడు అజయ్, జిల్లా శాఖ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అవగాహన సదస్సు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 27: జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగులకు న్యాయ సేవా భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రభుత్వ పరంగా వారికి అందాల్సిన సంక్షేమ పథకాలు తదితర అంశాలపై డీఎల్ఎస్ఏ కార్యదర్శి భోనగిరి సౌజన్య వారికి వివరించారు. ఇందులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేష్, దివ్యాంగులు పాల్గొన్నారు.



నిర్మల్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్, నాయకులు

'మరలపెల్లికి బస్సులు నడపండి'

బోథ్, జూన్ 28: మండలంలోని మరలపెల్లి గ్రామం వరకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొర్ల రాజు యాదవులు శుక్రవారం నిర్మల్ డిపో మేనేజర్ ప్రణీతరెడ్డికి వినతిపత్రం అందించారు. గతంలో రోడ్డు బాగా లేదని బస్సును రద్దు చేశారని, ఇటీవల రోడ్డు సౌకర్యం మెరుగుపడినందున మరలపెల్లి మీదుగా నిగిని వరకు బస్సు నడపాలని కోరారు. కాగా బస్సు పునరుద్ధరించాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సైతం డిపో మేనేజర్‌తో ఈ విషయమై మాట్లాడటం జరిగిందని, తప్పనిసరిగా బస్సు వేసేందుకు హామీ ఇచ్చారని వారు తెలిపారు. బస్సు సౌకర్యం కల్పిస్తే ఈ రూట్‌లో 18 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కలుగుతుందని వివరించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులు అనిల్ అప్పా, వీడీసీ చైర్మన్ గంగాధర్, నాయకులు ఎస్‌కే అబూ, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పీఏగా డిప్యూటీ తహసీల్దార్

ఉట్నూర్, జూన్ 28: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పర్సనల్ అసిస్టెంట్‌గా ఉట్నూర్ డిప్యూటీ తహసీల్దార్ వెడ్మ భుజంగ్‌రావును నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వెడ్మ భుజంగ్‌రావు శుక్రవారం ఉట్నూర్ క్యాంపు కార్యాలయంలో ఉన్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ను కలిసి పూలమొక్క అందించి బాధ్యతలు స్వీకరించారు.

'అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 28: తెలంగాణ వచ్చి పదేళ్లు గడిచిన పార్టీలు మారినాయి కానీ విద్యార్థుల బతుకులు మారడం లేదని ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ అక్షయ్ అన్నారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం ఏబీవీపీ జిల్లా శాఖా ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవిద్యార్థులకు కార్పొరేట్ బడిలోకి వెళ్లలేక ప్రభుత్వ పాఠశాలకు వెళ్తే కనీసం మౌలిక వసతులు కూడా ఉండడం లేదన్నారు. విద్యార్థులు ఉండే పాఠశాలలో పందులు, కుక్కలు స్వైర విహారం చేయడంతో తినే ఆహారం కూడా విషంగా మారి ఫుడ్‌పాయిజన్‌కు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఇలా ఉన్నాయని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తే బుక్స్ ఫీజులు, యూనిఫాంలు అని విచ్చలవిడిగా అమ్ముతున్నారని ఆరోపించారు. ఇందులో నాయకులు తదితరులున్నారు.

'సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 28: నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు ఎస్ఎస్ యూఐ యువజన సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తునే ఉంటామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తోటకపిల్ తెలిపారు. శుక్రవారం విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా ఎంపీ ఇంటి ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తోట కపిల్ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ జరిపించి ఎన్‌టీఏ సంస్థను రద్దు చేసి, పేపర్ లీక్‌కు పాల్పడ్డ వారిపై క్రిమినల్‌కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో విద్యార్థి సంఘాల నాయకులు బి.రాహుల్, యూఎస్ ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, సుజయ్, అశోక్, గంద్రత్ శ్రీకాంత్, కౌడాల అఖిల్, రాహుల్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న లారీ బోల్తా

నేరడిగొండ, జూన్28: మండలంలోని కుప్టి ఘాట్ వద్ద శుక్రవారం తెల్లవారు జామున పశువులను తరలిస్తున్న కంటైనర్ (లారీ) అదుపు తప్పి బోల్తా పడడంతో మొత్తం ఐదు పశువులు (ఎద్దులు) మృతి చెందాయి. దీనికి సంబంధించి ఎస్సై శ్రీకాంత్ తెలపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పశువుల మార్కెట్‌లో 20 ఎద్దులను నిల్వకొడుకు చెందిన అనిల్ కుమార్, సాయికుమార్, సతీష్‌లు కొనుగోలు చేసి హైదరాబాద్ తరలించే క్రమంలో కుప్టి ఘాట్ వద్ద అతివేగం, అజాగ్రత్తగా వాహనం నడపడంతో కంటైనర్ బోల్తా పడింది. దీంతో అందులో గల 20 పశువులలో ఐదు మృతి చెం దాయి. స్థానికుల సహాయంతో పశువులను బయటకి తీయగా సంఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌తో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు./



● పాఠశాలలో అల్పాహారం తింటున్న విద్యార్థులు(ఫైల్)



● నేరడిగొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తున్న అధికారులు (ఫైల్)





విద్యార్థులకు.. అందని అల్పాహారం!

- జిల్లాలో గతేడు సర్కారు బడుల్లో అల్పాహారం పథకానికి శ్రీకారం
- పాఠశాలలు పునః ప్రారంభమైనా.. ఇంకా ఊసెత్తని రాష్ట్ర ప్రభుత్వం
- మధ్యాహ్న భోజనంతోనే సరిపెడుతున్న సంబంధిత శాఖ అధికారులు
- పేద విద్యార్థులకు అందని బ్రేక్‌ఫాస్ట్
- మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆకలితోనే అలమటిస్తున్న వైనం
- విద్యార్థుల గైర్హాజరు పెరిగి.. హాజరు శాతం తగ్గిపోతోందన్న అనుమానాలు
- అల్పాహార పథకాన్ని అమలు చేయాలని కోరుతున్న తల్లిదండ్రులు

ఆదిలాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వ హయాంలో సీఎం అల్పాహార పథకానికి శ్రీకారం చుట్టారు. గతేడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎంతో హడావుడి చేసి అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడం.. కాంగ్రెస్ అధికారంలోకి రావడం తో మళ్లీ పథకం అమలు తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దసరా పండుగ సందర్భంగా ప్రారంభించిన అల్పాహార పథకానికి ఎన్నికలతో స్వల్పంగా బ్రేక్ పడింది. ఆ తర్వాత వేసవి సెలవులు రావడంతో పూర్తిగా నిలిపి వేశారు. దీంతో మూన్నాళ్ల ముచ్చటగానే మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈయేడు జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమైనా.. ఇప్పటి వరకు అల్పాహార పథకం అమలుపై ప్రభుత్వం స్పష్టతనివ్వడం లేదు. ప్రస్తు తం ప్రభుత్వ ఆదేశాలు లేవంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. గతంలో మండలానికి ఒక ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసి అల్పాహార పథకాన్ని అమలు చేశారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు. ఇందులో భాగంగా ఒక్కో రోజు ఒక్కో రకమైన అల్పాహారాన్ని అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం గోధుమ రవ్వ, ఉప్మా చట్నీ, మంగళవారం టమాటా రవ్వ, సాంబర్, బుధవారం కిచిడి, గురువారం పొంగల్ సాంబర్, శుక్రవారం గోధుమ రవ్వ, కిచిడి, శనివారం కూరగాయల పలావ్‌తో మెనూను అమలు చేశారు. ప్రతీరోజు పాఠశాల సమయానికి 45 నిమిషాల ముందు విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు. దీంతో నిరుపేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలిగింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనంతో విద్యార్థులు చదువుల పట్ల ఎంతో ఆసక్తిని చూపించారు. ఇలాంటి కార్యక్రమాలతో హాజరుశాతం కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. కానీ కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తివేసే దిశగానే అడుగులు వేస్తోందన్న అభిప్రాయాలు అధికారవర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

ఉదయం పస్తులతోనే బడికి..

వర్షాకాలం సీజన్ ప్రారంభంకావడంతో జిల్లాలో సాగు పనులు ఊపందుకుంటున్నాయి. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయ పనుల్లోనే నిమగ్నమవుతున్నారు. ఉదయం 9గంటలకే పాఠశాలలు ప్రారంభం కావడంతో హడావుడిగా పస్తులతోనే విద్యార్థులు బడికి హాజరవుతున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వ రకు ఆకలితోనే అలమటిస్తున్నారు. ఉదయం అ ల్పాహారం (బ్రేక్ ఫాస్ట్) లేకపోవడంతో విద్యార్థులు నీరసం, అలసటకు గురవుతున్నారు. దీంతో చదువులపై సరైన దృష్టిని సారించడం లేదంటున్నా రు. మధ్యాహ్నం తర్వాత భోజనం చేసిన అజీర్తితో గ్యాస్, యాసిడిటి లాంటి స మస్యలతో సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితులతో సర్కారు బడుల్లో విద్యార్థుల గైర్హాజరు పెరిగి.. హాజరు శాతం భారీగా తగ్గిపోతోందన్న టాక్ వినిపిస్తోంది. అల్పాహారం అమలు చేసిన రెండు మాసాలు పాఠశాలల్లో ఆశిం చిన స్థాయిలోనే హాజరు శాతం కనిపించింది. ఇంటి వద్ద భోజనం చేయని విద్యార్థులు ఉదయమే పాఠశాలకు వచ్చి బ్రేక్ ఫాస్ట్ చేసి పాఠశాల సమయం వరకు అక్కడే ఉండి చదువుకునే వారు. ప్రస్తుతం అల్పాహార పథకం అమలు కాకపోవడంతో విద్యార్థులు బడి సమయానికి ఆలస్యంగా హాజరవుతున్నట్లు తెలుస్తుంది. దీంతో తరగతులు కూడా ఆలస్యంగా ప్రారంభమవుతున్నాయని చె బుతున్నారు. పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు కావొస్తున్నా.. ఇప్పటి వరకు ప్రభుత్వం అల్పాహార పథకం అమలుపై ఊసెత్తక పోవడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఎదురుచూపులు తప్పడం లేదంటున్నారు.

ఇక బ్రేక్‌ఫాస్ట్ ఉండదట!!

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అల్పాహార పథకం అటకెక్కడంతో ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ ఉండదనే అభిప్రాయాలు వస్తున్నాయి. గతంలో మాదిరిగానే ప్రస్తుతం అధికారులు మధ్యాహ్న భోజనంతోనే సరిపెడుతున్నారు. తమిళనాడు రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేయాలని గత ప్రభుత్వం భావించింది. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారానికి దూరం కావడంతో అంచనాలు తారుమారయ్యాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అల్పాహార పథకాన్ని కొనసాగించేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదన్న చర్చ సాగుతోంది. జిల్లాలోని 18 మండలాల్లో మొదట ఒక్కో మండలానికి ఒక్క పాఠశాల ను ఎంపిక చేసి అల్పాహార పథకాన్ని అమలు చేశారు. ఆ తర్వాత దశల వారీ గా అన్ని పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రెండు మాసాల్లోనే మంచి ఫలితాలు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమైంది. విద్యార్థులు సమయానికి బడికి హాజరు కావడంతో పాటు ఏకాగ్రతతో చదువులు కూడా కొనసాగించారు. కానీ ఈ పథకాన్ని పూర్తిగా నిలిపివేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్య తరగతి, పేద విద్యార్థులే ఎక్కువగా చదువుకుంటారు. దీంతో వారికి రకరకాల నాణ్యమైన అల్పాహారం అందించడంతో విద్యార్థుల్లో ఉత్సాహం కనిపించింది. ముఖ్యంగా ఈ పథకం అమలుతో మారుమూల గిరిజన గ్రామాల్లోని నిరుపేద విద్యార్థులకు ఎంతో మేలు జరిగింది. ఇకనైనా ప్రభుత్వం నిరుపేద విద్యార్థుల కుటుంబ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అన్ని పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులు అందరికీ అల్పాహారాన్ని అందించాలి

: పద్వాల్ సందీప్, 10వ తరగతి విద్యార్థి, బజార్‌హత్నూర్ మండలం



ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం అల్పాహారాన్ని అందించింది. అదే మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా విద్యార్థులందరికీ అల్పాహారాన్ని అందిస్తే బాగుంటుంది. కొంతమంది విద్యార్థులు ఉదయం ఎలాంటి భోజనం చేయకుండానే హడావుడిగా పాఠశాలకు వస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆకలితోనే చదువులు కొనసాగించాల్సి వస్తుంది. ఇకనైనా ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని అందించాలి.

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు

: ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్



ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. గతంలో మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి ఈ పథకాన్ని అమలు చేయడం జరిగింది. ప్రస్తుతం అలాంటి ఆదేశాలు లేకపోవడంతోనే అమలు చేయడం లేదు. తదుపరి ప్రభుత్వ ఆదేశాలు రాగానే విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ప్రతీ పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నాం.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

ఆదిలాబాద్ రూరల్, జూన్ 27: ఈనెల 29న ఆదిలాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ మొహమ్మద్ ఖమర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నూతన మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. కావున కౌన్సిల్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

..ఉట్నూర్‌లో తైబజార్ వేలం

ఉట్నూర్, జూన్ 28: ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వారసంత, దినసంతల వేలం శనివారం నిర్వహించనున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శి శంకర్ తెలిపారు. ఈ సంవత్సరం జూలై నుంచి 2025 మార్చి31 వరకు తయ్ బజార్ వసూలు చేసుకొనుటకు నిర్వహించనున్న వేలం పాటకు ఆసక్తి ఉన్న గిరిజనులు హాజరు కావాలన్నారు. మిగత వివరాలకు గ్రామ పంచాయతీలో సంప్రదించాలన్నారు.

..వారసంత, దుకాణ సముదాయాల వేలం

ఇచ్చోడ, జూన్, 28: ఇచ్చోడ మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన వ్యాపార దుకాణ సముదాయాలతో పాటు పంచాయతీ పరిధిలోని వార సంత, పశువులు, మేకల సంత, రోజువారి సంతలకు సంబంధించి శనివారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఈవో సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ తెగల కలాలకు సంబంధించిన ఇచ్చోడ స్థానికులకు మాత్రమే అవకాశమని, పాల్గొనేవారు 29న ఉదయం 10:30 గంటల లోపు డీడీలు గ్రామ పంచాయతీలో సమర్పించిన వారు మాత్రమే వేలం పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. వేలంలో నెగ్గిన వ్యక్తి మాత్రమే వ్యాపారం చేయాలని ఇతరులకు లీజ్, సబ్ లీజ్‌కు ఇవ్వరాదని పేర్కొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ, జూన్, 28: ఇచ్చోడ పభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల కోసం అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో జూలై 2లోగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఇంగ్లీష్, తెలుగు, ఎకనామిక్స్, హిస్టరి, బాటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టులు బోధించేవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూలై 3న డెమో తరగతులకు ధ్రువపత్రాలతో హాజరవ్వాలని ఆయన సూచించారు.

దేశ అభ్యున్నతికి బాటలు వేసిన పీవీ

● తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ● ఘనంగా పీవీ నరసింహారావు జయంతి



పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఉట్నూర్‌లో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

ఆదిలాబాద్ రూరల్/ మావల, జూన్ 27: బహుభాషా కోవిదుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, దేశ అభ్యున్నతికి కొత్త బాటలు వేసిన ఆర్థికవేత్త పీవీ నరసింహారావు అని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. భారత దేశ 9వ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి తన నివాసం ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఆధునిక ఆర్థిక వ్యవస్థను రూపొందించేలా అనేక ప్రణాళికలను ప్రవర్తించిన మహానుభావుడన్నారు. ఆయన జీవితం ప్రతీఒక్కరికి ఆదర్శమన్నారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నలిమెల నవీన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, కుదురు పక్క సురేష్, నాగరాజు రంజిత, శ్రీనివాస్, వెంకటేష్, అడెల్లు, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో బోలిచేతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదే విధంగా బోలిచేతో ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు పీవీ నరసింహారావు స్ఫూర్తితో ముందుకు సాగుద్దాం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు జాదవ్‌సురేష్, రాథోడ్ ప్రకాష్, గోడంశ్రీనివాస్, బోలిచేతో ఫౌండేషన్ ప్రతినిధులు ఆత్రం మోతిరామ్, సిడాం వరప్రసాద్, సిడం కిరణ్‌లు పాల్గొన్నారు.

పకడ్బందీగా పంటల నమోదు : ఏడీఏ

తలమడుగు, జూన్ 28: ఖరీఫ్ సీజన్‌లో పకడ్బందీగా పంటల నమోదును చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏడీఏ రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఝరి శివారు ప్రాంతంలో వ్యవసాయ శాఖ అధికారులు చేపడుతున్న పంటల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 37వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయని, వ్యవసాయ అధికారులు ప్రతీ పంట క్షేత్రాన్ని పరిశీలించి పంటలను ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. ఇప్పుడు ఆన్‌లైన్ నమోదు చేయడంతో రైతులకు పంటల విక్రయ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఇందులో సీనియర్ ఏఈవోలు రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పంటల నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ రవికుమార్



కాలనీలో రోడ్డుపై నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి : కలెక్టర్ రాజార్షి షా

ఆదిలాబాద్ రూరల్, జూన్ 27: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతీఒక్కరు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడలో డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. కాలనీలో విస్తృతంగా తిరుగుతూ పారిశుధ్యంపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగుపై డిజిటల్ సర్వే

● పైలెట్ ప్రాజెక్టుగా మావల మండలం ఎంపిక

ఆదిలాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని మావల మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టింది. దీంతో క్షేత్ర స్థాయిలో పంటల సాగును పరిశీలించి వివరాలను డిజిటల్ విధానంతో నమోదు చేయనున్నారు.ముఖ్యంగా క్రాప్ సర్వే ద్వారా పత్తి, వరి, సోయా, కంది జొన్న పంటల సాగు విస్తీర్ణాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో బీడు భూముల వివరాలు, పోడు భూముల విస్తీర్ణం, తదితర వివరాలను నమోదు చేయనున్నారు. దీంతో రైతులకు పలురకాల ప్రయోజనాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ సర్వే ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు కిసాన్ సమ్మాన్ నిధి, పీఎం ఫసల్ బీమా యోజన పథకాలను సక్రమంగా అమలు చేసే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే మావల మండలంలో డిజిటల్ సర్వేను చేపట్టిన వ్యవసాయ శాఖాధికారులు ఇతర మండలాల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

'సీసీఐని పునః ప్రారంభించాలి'

ఆదిలాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మూతబడిన సీసీఐ పరిశ్రమను పునః ప్రారంభించాలని కోరుతూ జిల్లా ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌లు మర్యాదపూర్వకంగా కేంద్రమంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి వారు కలిశారు. ఈ సందర్భంగా 30ఏళ్లుగా మూతబడి ఉన్న సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశ్రమను ప్రారంభిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా 5వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలో సిమెంట్ ముడిఖనిజం లైన్‌స్టోన్ నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మంత్రి శ్రీదర్‌బాబు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

కాంగ్రెస్ గూటికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

● మంత్రి పొంగులేటి సమక్షంలో చేరిక

ఆదిలాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఆదిలాబాద్‌లో ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి చేరారు. 30వ వార్డు కైలాసనగర్ కౌన్సిలర్ అర్చన రాంకుమార్‌తో పాటు 10వ వార్డు కౌన్సిలర్ రాంనగర్‌కు చెందిన సుజాతా భూమన్నలు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో ఆదిలాబాద్ మున్సిపల్‌లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల సంఖ్య తగ్గింది. అంతేకాకుండా ఇప్పటికే పలువురు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌ను విడిచి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అయితే తాజాగా మరో ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జహీర్‌రంజానిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషాకు ఫిర్యాదు చేసిన పది రోజుల్లోనే కౌన్సిలర్లు పార్టీలు మారడం ప్రాధాన్యత ఏర్పడుతుంది. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు దీటుగా కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు పదును పెట్టడంతో వలసల పరంపర కొనసాగుతుంది. కంది శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో పని చేసేందుకు కాంగ్రెస్‌లో చేరామంటూ పలువురు కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తుమల్లేష్, సీనియర్ నాయకులు వేణుగోపాలచారి, కాంగ్రెస్ నాయకులు లోకప్రవీణ్‌రెడ్డి, దేరావ్యష్టారెడ్డి, నరేష్‌రెడ్డి, అఖిల్, తదితరులున్నారు.